# లార్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్

పోస్ట్ బాక్స్ నెం. 2007, ఫైర్ ఫాక్స్. వి.ఏ. 22031.


## ప్రేమ శాశ్వతకాలముండును (Love Never Fails)


జాయిసీ మోరీస్ By Joyce Morris 23/11/1986


గడచిన రెండు వారముల నుండి దేవుడు ఒక విషయమును గురించి మాతో మాట్లాడుచూ ఉన్నాడు. ఆ విషయమును గురించి మేము ఆలకించినపుడు మళ్లీ మళ్లీ తిరిగి అవే మాటలు మాకు ధ్వనించు చున్నవి. దేవుడు నీతో కొన్ని విషయాలు చెప్పుట ప్రారంభించినపుడు ఆ మాటలు నీకు అన్వయించుకొని అభ్యసించే పరిస్థితులు నీకు కల్పిస్తాడు. ఆయన మాటలు లేదా వాక్యము ప్రతి సమయమందును పనిచేయును. ఈ రోజు నీవు ఈ మాటలు గ్రహించి, నీ జీవితమును మార్చుకొను లాగున నీ కొరకు ప్రార్ధన చేయుచున్నాను. నన్ను మార్చింది దేవుని యొక్క వాక్యం. ఈ వాక్యమే మనందరిని స్థిరముగా మార్చును.

మనం వివిధ రకాలుగా ఆలోచిస్తాం, వివిధ రకాల పరిస్థితులు చూస్తుంటాం. మన వైఖరులు, లక్ష్యాలు, ప్రవర్తనలు, చర్యలు మారుతూ ఉన్నాయి. ఈ మార్పు ద్వారా దేవుడు స్థిరమైన స్థితిలోనికి మనలను రప్పించు చున్నాడు. ఈ రోజు నీవు ఈ మాటలు గ్రహించినట్లయితే, నీ జీవితంలో నూతనమైన మార్పును చూస్తావు. మనం మార్పు చెందాలని దేవుడు కోరుచున్నాడు. "కుమారుడా పైకి రా,ఉదయాన్ని తీసుకురా అనే గీతం ఉదయాన్నే మనం పాడినట్లుగా''. కొంతమంది ప్రజలున్నారు, వారు ఒక నూతన ఉదయాన్ని తీసుకు రావాలని వెళుతున్నారు. ఎవరికైనా క్రొత్త దనాన్ని తీసుకు రావాలని నీవు కోరినట్లయితే, ఆ ఉదయం మొట్టమొదట నీలో రావాలి. ప్రభువు మనకు మాట ఇచ్చుట ద్వారా మనతో మాట్లాడుచున్నాడు, మనకు బోధించుచున్నాడు . నేను శక్తిహీనురాలనని, దేవుని వాక్య పరిచర్య చేయుటకు, ప్రజలకు బోధించుటకు అసమర్ధురాలనని దేవునితో మాటలాడు చున్నాను (నా బలహీనతను నేను దేవుని యెదుట ఒప్పుకొనుచున్నాను). మనల్ని మనం మితంగా సమర్ధించుకుంటాం ఎందుకుంటె కొన్ని సమయాలలో మనం మాట్లాడిన మాటల వల్ల యేమియు జరగదని అనుకుంటాం. దేవుడు మనకు మాట ఇచ్చుచున్నాడు, హద్దులు లేని ఆత్మీయ రాజ్యంలో ఎలా చేరాలో సూచిస్తున్నాడు. ఎక్కడైతే యేసుక్రీస్తు నడుస్తాడో అక్కడ ఆత్మీయ రాజ్యమున్నది. ఈ గొప్ప శక్తిని దేవుడు మనకు చూపించాడు. దేవునిలో ప్రేమా ఐఖ్యత కలిగి నడచుకొనే రాజ్యాన్ని దేవుడు మనకు అనుగ్రహించాలని ఇష్టపడుచున్నాడు. దేవుని చేత ప్రేమింపబడటానికి ఇదొక్కడే మార్గం. ఆయన్ని నీవు ప్రేమించినట్లయితే ప్రతి మానవుడ్ని నీవు ప్రేమించగలవు. ఇది ఒక ప్రేమ రాజ్యం. ఈ రాజ్యంలో నీవు నడచుకున్నప్పుడు గతంలో ఉన్నవాటి కంటె ఇప్పుడు అన్నీకూడా వేరువేరుగా కన్పిస్తాయి. మీలో కొంతమంది ప్రేమ అనే అంశాన్ని చదువుతుంటారని నేను అభిప్రాయ పడుచున్నాను. నా ఊహలో, దేవుడు మనకు ఈ రోజు సహితం ఎంతో ఎక్కువగా దేవుడు మనకు అనుగ్రహించుచున్నాడు. ఆయన నిన్ను ప్రోత్సాహపరుస్తున్నాడు. మనం ప్రేమ గురించి ఎంతో నేర్చుకుంటున్నాం. కాని ఇది ఇప్పుడు నేర్చుకుంటున్నదానికంటె ఎక్కువ. ఇది ప్రేమను బహిర్గతం చేయుట లేదా వెల్లడి చేయుట. దేవుడు ప్రేమయై యున్నాడు. అది నీ ద్వారా , నా ద్వారా వెల్లడి కావాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఇదొక్కటే మార్గం. దేవుడు ఆయన కొరకు ఆయన తట్టు మనల్ని మార్చాలనుకుంటున్నాడు. మనం ఒక జనాంగం. ఎవరిమైతే దేవునిలో జీవించాలని కోరుకుంటామో అలాంటి మన తలంపులు, విషయాలను గమనించే తీరు మారిపోతాయి. మనం ప్రజల పట్ల చూసే విధానం, మరియు అదే మార్గంలో వార్ని మనం సమ్మతించాలి. ఈ లోకం మనకు శాశ్వతం కాదు, స్థిరం కాదు అని దేవుడు చెప్పాడు. ఇతరుల మార్గములు గాని, ప్రవర్తన గాని, క్రియలు గాని, వైఖరులు గాని లేదా వారు విషయాలను చూచే విధానము గాని మనకు అన్వయించరాదు. మనం ఈ లోకంలో శాశ్వతంగా ఉండము కాని మన కొక రాజ్యమున్నది. ఆ రాజ్యంలో

స్థిరంగా ఉంటాము. ఈ రాజ్యములో ఉండే సిద్ధాంతములు, ఆలోచనలు వేరుగా ఉంటాయి. దేవుని ఉద్దేశ్యము మన ఆలోచనల కంటె ఉన్నతమైనవి. మన ఆలోచనలు దేవుని ఆలోచనలతో ఐఖ్యమై ఆయనలా ఆలోచించాలని దేవుడు కోరుచున్నాడు. మీరు ఎవరితోనైనా ఒకటైనప్పుడు వారి ఆలోచనల వలె మీరును ఆలోచిస్తారు. సీయోనులో మనం నివసించాలని దేవుడు కోరుకుంటున్నాడు. సీయోనులో నివసించుట అనగా ఆత్మీయ రాజ్యములో నివసించుటయే. నీవు ఆత్మీయ రాజ్యములో నివసించి నట్లయితే నీ స్థితి సుందరమైనదై ఉంటుంది. **ఉత్తర దిక్కున మహారాజు వట్టణమైన సీయోను వర్వతము రమ్యమైన ఎత్తుగలచోట నుంచబడి సర్వభూమికి సంతోషకరముగా ఉన్నది** (కీర్తనలు 48:2).

కీర్తనల గ్రంథంలో దేవుడు చీకటిని, వెలుగును సమానముగా చూచును అని చెప్పబడింది. **చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును. చీకటియు, వెలుగును నీకు ఏకరీతిగా యున్నవి** (కీర్తనలు 139:2). నాకొక ఉదాహరణ ఇమ్మని దేవుని అడిగాను. ఆయన నాకు చైనా దేశమును గుర్తు చేశాడు. నేను ఆలోచించడం మొదలు పెట్టాను. అది ఒక భయంకరమైన సంగతి ఎందుకనగా చైనా దేశమంతటా ఒకే మతం (సమాజం) వ్యాప్తి చెంది ఉండడానికి దేవుడు అనుమతించాడు. అంతకుమించి నేనింకేమియు ఆలోచించలేదు. మీరు ఇలా చెప్పవచ్చు, మంచిది సిస్టర్, చైనా దేశమంతా ఏకైక మతం మాత్రమే ఉండడం మీకు సమంజసమేనా అని, లేదు, కాకపోవచ్చు అని నేను అనడం లేదు. ప్రతి దానియొక్క చివరి ఫలితాన్ని దేవుడు గమనిస్తాడు. బౌద్ధ మతం, ఇతర దేవుళ్లను ఆరాధించడం దేవుడు చూచాడు. దేవుడు అంధకారమును దేశంలో ప్రవేశపెట్టి, అంతటా వ్యాపింప చేసి, వారి దేవుళ్లను, విగ్రహాలను నాశనం చేస్తాడు. అప్పుడు వారు సజీవుడైన, మరియు నిజమైన దేవుని వైపు తిరిగి ఆరాధిస్తారు.

మనం ఆలోచించిన ప్రతి విషయం కూడా చాలా విపరీతమైనది, అత్యంత అంధకారమైనది. దేవుడు అంతిమ ఫలితం కొరకు చూస్తున్నాడు. ఆయన చీకటిని, వెలుగును ఏకరీతిగానే చూస్తాడు. ఆయనకు తెలుసు, మంచి అనేది దాని నుండి రావలసి యున్నదని. ప్రతి విషయం వెనుక దేవుని యొక్క కాపుదల ఉన్నది.

రష్యా దేశాన్ని దేవుడు వాడుకున్నాడు. దానిలోనున్న వ్యర్థమైన వాటినన్నిటిని ధ్వంసం చేయించేలా చేశాడు. ఇప్పుడు చైనా దేశపు ప్రజలు క్రీస్తు వైపుకు మరలి వస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని కదలిక ఇప్పుడు కలిగినది. నీ స్థితిగతులన్నియు సుందరమైనవి. అదే విధానములో దేవుడు వాటిని చూస్తున్నాడు. **''దేని కాలమందు అది చక్కగా ఉండునట్లు, సమస్తమును ఆయన నియమించి యున్నాడు. ఆయన శాశ్వత కాల జ్ఞానమును నరుల హృదయమందు ఉంచి యున్నాడు గాని, దేవుడు చేయు క్రియలను పరిశీలనగా తెలుసుకొనుటకు అది చాలదు''** (ప్రసంగి 3:11). ప్రతీది ఆయన సమయంలో సుందరంగా ఉంటుంది. దేవుని వాక్యం చెప్పుచున్నదేమనగా ఈ లోకంలో నీవు ఎన్ని గంధర గోళ పరిస్థితులు చూసినా అన్ని విధాల దేవుడు వాటిని మార్చి వేయ దలచుకున్నాడు. అందుచేత నీవు కంగారు పడవలసిన అవసరం లేదు. యేమి జరుగుచున్నదో దానిని నీవు చూచుచున్నావు కాబట్టి, దేవుని యందే, ఆయన అదుపులోనే జరుగుచున్నట్లుగా తెలుసుకోవలెను. దేవుడు ఎలాగైతే మనలను చూస్తున్నాడో ఆప్రకారమే మనము ఆయన ప్రజలము కావాలని ఆయన కోరుకుంటున్నాడు అనగా నీ మనసు మార్చబడాలని ఆయన కోరుకుంటున్నాడు. నీ ఆలోచనా విధానంలో మార్పు ఉండాలి. తండ్రియైన దేవుడు నీ కొరకు ఆలోచించిన రీతిగా నీ ఆలోచన ప్రారంభించాలి. అందుచేత వాక్యంలో చెప్పబడింది, మీరు ఈ లోకస్తులతో పాలిభాగస్థులవ్వకండి కాని మీ మనస్సును నూతన పరచుకొనే రీతిలో మీరు స్థిరపడండి. **''మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనసు మారి, నూతనమగుట వలన రూపాంతరము పొందుడి''** (రోమా 12:2). ఎఫెసీ పత్రిక 3 వ అధ్యాయము నకు వెళదాము. ఈ రోజు మన వర్తమానము "ప్రేమ ఎన్నటికి విఫలము కాదు" లేదా ప్రేమ శాశ్వతకాలముండును" ప్రేమ దీర్ఘకాలము సహించును. నీవు ఎవరినైనా ప్రేమించినట్లయితే, వాళ్లు నీ మార్గములోనికి వచ్చేంత వరకు, కొన్ని సమయాలలో కనిపెట్టవలసి ఉంటుంది. ప్రేమ ఎన్నటికి విఫలము కాదు అనే విషయాన్ని నీవు గుర్తుంచుకోగలిగితే, వివిధ

అంశాలలో ప్రేమను నీవు కాపాడు కోగలవు. ఎఫెసీ 3:17 **"క్రీస్తు మీ హృదయములో విశ్వాసము ద్వారా నివసించునట్లు, ప్రేమయందు వేరుపారి స్థిరపడాలి"**

ఇతర విషయముల కంటె ఎక్కువగా, దేవుని ప్రేమయందు వేరుపారి స్థిరపడాలని దేవుడు కోరుచున్నాడు. స్థిరత్వం లేని అనేకమంది క్రైస్తవులను మనం చూస్తున్నాం. వారి నడతలోగాని, విధానంలో గాని, పరిస్థితులలో గాని, జీవితంలో గాని, కుటుంబాలలో గాని, సంఘాలలో గాని స్థిరత్వం లేదు. ఎందుకనగా వారు క్రీస్తులో నాటబడి వేరు పారలేదు. మీ వేరులు క్రీస్తులో లోతుగా నాటబడాలి. ఒక పెద్ద చెట్టు లోతుగా వ్రేళ్లూని, బలపడినట్లయితే, ఎంత పెద్ద తుఫాను వచ్చినా అది పడిపోవుటకు ఆస్కారం లేదు. అదే రీతిలో మనం ఆయనలోను, ఆయన ప్రేమలోను లోతుగా నాటబడి, బలపడాలని దేవుని ఆకాంక్ష. ఆయన ప్రేమలో మనం పాతుకుపోయినప్పుడు, ఏ తుఫాను వచ్చినా, ఎలాంటి కష్టనష్టములు వచ్చినా మనం కదల్చబడం ఎందుకంటే దేవునిలో లోతుగా, బలంగా నాటబడి దేవుని నమ్ముకున్నవారం కనుక. క్రైస్తవులు నేర్చుకొనవలసినదేమనగా, క్రీస్తు ప్రభువుతో వ్యక్తిగత సంబంధము కలిగి, దేవుని ప్రేమ యందు లోతుగా వేర్లూని నాటబడాలి. దేవుని ప్రేమను ఎక్కువగా అవగాహన చేసుకునే ఆత్మీయ జ్ఞానాన్ని దయచేయుమని దేవుని అడుగుటకు నీ ప్రార్థన ప్రారంభించు. దేవుని ప్రేమ అనగా యేమిటి? దేవుని ప్రేమను గురించి మాట్లాడాలంటే చాలా సమయం పడుతుంది. ఆయన ప్రేమ స్వార్థ పూరితమైనది కాదు. ఆయన ప్రేమకు ఎలాంటి షరతులు లేవు. నీవు ఆయనను ప్రేమించిన ప్రేమించకపోయిన, ఆయన నిన్ను ఎల్లప్పుడూ ప్రేమిస్తూనే ఉంటాడు. నీవు ఆయనకు యేమి ఇచ్చినా ఇవ్వకపోయినా ఆయన నీకు ఇస్తూనే ఉంటాడు. దేవునితో సంబంధము విషయంలో మనం వేరుపారి స్థిరపడవలసిన అవసరం ఉంది. ఎఫెస్సీ 3:17 **"క్రీస్తు మీ హృదయములో (స్థిరపడి, నిలిచి, ఆయన స్వంత గృహముగా చేసుకొనుట) విశ్వాసము ద్వారా నివసించునట్లు మీరు దేవుని సంపూర్ణత యందు పరిపూర్ణులగునట్లుగా ప్రేమ యందు వేరుపారి స్థిరపడి".** చాలామంది క్రైస్తవులు అభద్రతా భావాన్ని కలిగియున్నారు ఎందుకనగా వారు దేవుని ప్రేమయందు నాటబడలేదు గనుక. మనం దేవుని ప్రేమయందు నాటబడి ఆయనతో సంబంధం కలిగియున్న యెడల మనకు ఆయనయందు భద్రత ఉంటుంది ఎందుకనగా మనము ఆయనయందు నమ్మిక యుంచాము. పైన చెప్పబడిన అదే వాక్యభాగము ఈ విధంగా చెప్పుచున్నది, **"సమస్త పరిశుద్ధులతో కూడా దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించు కొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలుసుకొనుటకును తగిన శక్తిగల వారు కావలెననియు"** దేవుడు ఈ రోజు. నాకనుగ్రహించిన ఈ వర్తమానమును బట్టి ప్రేమ ఎంత వెడల్పైనదో, పొడవైనదో, ఎత్తైనదో, లోతైనదో తెలుసుకొనుటకు నీవు ప్రారంభిస్తావు అని నేను నమ్ముచున్నాను. నీయంతట నీవే క్రీస్తు ప్రేమను గురించి తెలుసుకొని, క్రీస్తు ప్రేమను అనుభవిస్తావు. ఈరోజు నేను ఎంతోమందిని చూస్తున్నాను ఎంతో జ్ఞానం కలవారిని కాని వారు ఆత్మఫలములు లేనివారు. దేవుడు మనకిచ్చిన వివేకముతో నిజముగా ప్రారంభించి, అనుభవం పొందకపోయినట్లయితే ఫలితం ఉండదు. దేవుడు మనకు జ్ఞానము, వివేకము మరియు అవగాహన ఇచ్చును కావున దేవునితో మన నడకలో వీటిని అనుభవించగలము. ఈ అనుభవము ఆత్మ ఫలమును ఉద్భవింపచేయును. ఈ ఫలము ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతమును ఉత్పత్తి చేయును. **"జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలుసుకొనుటకు(అభ్యాసము మరియు అనుభవం ద్వారాను) దేవుని సంపూర్ణత యందు పరిపూర్ణు లగునట్లు (దేవునితో ఎక్కువ సహవాసము కలిగి ఆయనతో మమేకమై యుంటావు)"** దేవునితో పరిపూర్ణంగా నింపబడే స్థలానికి ఆయన మనలను తీసుకురావాలని కోరుచున్నాడు. మనము ఆయనతో నింపబడినప్పుడు మన మాటలు, మన ఆలోచనలు, మన ముఖవైఖరి ద్వారా దేవుని ప్రత్యక్షత ఈ భూమిమీద ఉంటుంది. **"దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి మిగుల ఆశతో తేరి చూచి కనిపెట్టుచున్నది"** రోమా 8:19. దాని అర్థం యేమనగా, సంఘము ద్వారా దేవుని స్వరూపము తెలియచేయ బడాలని ఎదురుచూస్తుండడం. మార్పు చెందడానికి ఒకే ఒక మార్గము యేదనగా దేవుని పరిపూర్ణతతో నింపబడటమే. ఈ మార్పు అనేది నీ మనస్సులో చోటు చేసుకోవాలి. మార్పు లేదా రూపాంతరము అనగా నీ రూపము, నీ స్వభావము మరియు నీ

ప్రవర్తనలో మార్పు రావడం. రూపాంతరము, రూపము మార్పు చెందుట, రూపకల్పన ఇవన్నీ ఒకే అర్థాన్నిస్తాయి. సీతాకోక చిలుకను ఉదాహరణగా తీసుకొనండి. ఒక గొంగళి పురుగు చూడ్డానికి నిజంగా అసహ్యంగా ఉంటుంది. చెడ్డ వాసన వేసే పురుగుగా చూడబడుతుంది. దేవుడు మనలను మార్చనంత వరకూ కూడా మనము కూడా అలాంటి వారమే. గొంగళి పురుగు భూమి హద్దు వరకే పరిమితమైన క్రిమి. మన హృదయాలోచనలు కూడా మనలను భూమి ఎల్లల వరకు మాత్రమే పరిమితము చేస్తాయి. గొంగళి పురుగు నూతనత్వం లేదా రూపాంతరం చెందినప్పుడు అందమైన సీతాకోక చిలుకగా మారి, స్వేచ్ఛగా గాలిలో, ఆకాశంలో విహరించే క్రిమిగా మార్పు చెందుతుంది. దానికి భూసంబంధమైన హద్దులు ఇక వుండవు. అందచేతనే మన తలంపులు దేవుని తలంపులలోనికి పరిపూర్ణత చెందాలని దేవుడు కోరుచున్నాడు. ఎప్పుడైతే క్రీస్తు మనస్సు కలిగి యుంటామో అప్పుడు హద్దులు లేని ఆత్మీయ రాజ్యంలో నడుస్తాము. అక్కడ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు హద్దులు ఉండవు. నీ మనస్సులో మాత్రమే ఇలాంటి పరిమితులు నీవు కలిగియుంటావు. మనము భూసంబంధమైన జీవులుగా ఉండాలని దేవుడు కోరుటలేదు గాని ఆత్మీయ జీవులుగా ఉండి **ఆత్మీయ రాజ్యం** లో నివసించాలని ఆయన కోరుచున్నాడు. ఆత్మను పొందుకోవడం అంత కష్టమేమీ కాదని దేవుడు నాకు చూపించడం మొదలు పెట్టాడు. నీ హృదయాలోచనలను పక్కన పెట్టి దేవుని స్తుతించుట ద్వారా దేవుని ఆత్మలో ప్రవేశించగలవు. అప్పుడు నీవు ప్రభువు ఆత్మను పొంది అన్ని తలంపులను అధిగమించి పూర్ణశాంతిని పొందగలవు. ఆత్మలో ఎలా జీవించాలో మనం నేర్చుకోవాలని దేవుడు కోరుచున్నాడు. మన తలంపులే దేవుని ఆత్మనుండి మనలను బయటకు తీసుకువస్తాయి అని దేవుడు చెప్పుచున్నాడు. పంచేంద్రియ రాజ్యములోనికి మనము వెళ్లినప్పుడెల్లా మనము దేవుని ఆత్మనుండి బయటకు రావడం జరుగుతుంది.

ఏదేను తోటలో రెండు వృక్షములు ఉన్నాయి. నీవు తోట అనే విషయాన్ని జ్ఞాపకము చేసుకో. ఆదాము హవ్వలు జీవవృక్షములో పాలిభాగస్థులుగా ఉన్నంత వరకూ వారు ఆత్మీయ రాజ్యంలో ఉన్నారు. మంచి చెడులు తెలిపే వృక్షములో వారు పాలిభాగస్థులు అయినపుడు ఆత్మీయ రాజ్యమునుండి వైదొలగడం జరిగింది. ఇదే విషయం మన జీవితంలో కూడా జరుగుచున్నది. దేవుని ఆత్మలో ఉన్నంత కాలం దేవుడు చూస్తున్నట్లుగానే మనము చూస్తూ ( ఆయన వాక్యం ప్రకారం ఆయన ఆత్మ చెప్పుచున్నట్లుగా జీవిస్తాము) ఆత్మలో కొనసాగుతాము. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు మనం తినిన యెడల పంచేంద్రియ రాజ్యములో ( అనగా చూచుట, వినుట, రుచి చూచుట, వాసన చూచుట, తాకుట అనే 5 ఇంద్రియాలు; భావాలు, ఉద్రేకాలు) ప్రవేశించి, వెనువెంటనే ఆత్మీయ రాజ్యమునుండి వైదొలగుట ప్రారంభమగును. మనమెప్పుడూ కూడా చెడువైపు చూసే ప్రజలమే కాని దేవుడు మరొకటి మనకు చూపిస్తున్నాడు **ప్రేమ చెడును యోచించదు** మనం ప్రేమ రాజ్యంలో ఉన్నప్పుడు చెడును యోచించము. యేసు క్రీస్తు వారు రూపాంతర కొండకు యాకోబును, యోహానును, పేతురును వెంటబెట్టుకుని వెళ్లిన సంగతిని జ్ఞాపకం చేసుకోండి. ఆరవ రోజు అయ్యేంత వరకు ఆయన వారిని తీసుకొని వెళ్లలేదు. శరీరము, మనస్సు ఆయనతో ఏకీభవించిన తరువాత ఆయన వారిని కొండకు తీసుకుని వెళ్ళెను. వారు ఆ రూపాంతర కొండమీద ఉన్నప్పుడు ఆయన శరీరంలో ఒక మార్పు చోటు చేసుకొనెను. ఆత్మ రాజ్యంలోనికి రూపాంతరం చెందినప్పుడు ఆత్మ మాత్రమే కాకుండా శరీరంలో కూడా మార్పు చోటు చేసుకుంటుంటుందని. దేవుడు చూపిస్తున్నాడు. పేతురు విశ్వాసానికి, యోహాను ప్రేమకు, యాకోబు నిరీక్షణకు సాదృశ్యముగా ఉన్నారని మనకు తెలుసు. ఆత్మలో నిలిచియుండడానికి ఒకే ఒక మార్గము విశ్వాసములో నడవటమే. అవిశ్వాస్యతతో లీనం అయినపుడు మనము బాధపడుట ప్రారంభిస్తాము, ఆ తరువాత దేవుని ఆత్మ రాజ్యమునుండి వైదొలగిపోతాము. మనము దేవుని వాక్యమునందు విశ్వాసముంచుటకు కారణమగు లాగున దేవుడు కొంతమందిని లేవనెత్తుచున్నాడు. విశ్వాస రాజ్యములో మనము నడుచుచున్నాము. విశ్వాసము అనగా నమ్మిక. మనము ఎవరిమీదైన నమ్మిక యుంచినపుడు దేనిని గురించి బాధపడవలసిన అవసరం లేదు. ప్రేమలో మనం నడచినపుడు ఆత్మీయ రాజ్యంలో నిలిచి యుండగలం. మనం నిరీక్షణతో నడిచినప్పుడు, ఆ నిరీక్షణ అధికమైనపుడు దేవుడు ఆయన ఉద్దేశ్యాన్ని నెరవేర్చును. మనము ఆయన ఆత్మ రాజ్యంలో నిలిచియుండునట్లు ఆయన

ప్రయత్నిస్తున్నాడు. మనము ఆత్మీయ రాజ్యములో నడుస్తున్నప్పుడు దేవుని గొప్ప శక్తిని పొందుకోగలము. మనము పరిస్థితులను చూచే విధానము మరియు ఆలోచించే విధానము వలన దేవుడు అన్ని సమయాలలోను వాడుకోడు. దేవుడు చేసే మార్గములో మనము పరిస్థితులను చూడలేము. మనం చేసే దానికంటె దేవుడు చూసే, యోచించే ఉద్దేశ్యములు పూర్తిగా వేరు. మనము ఆత్మీయ రాజ్యములో ప్రవేశించినపుడు దేవుడు చూసే విధానములోనే ప్రజలను మనము చూడాలని ఆయన చూపిస్తున్నాడు. మనం ఏ విధంగా ఆలోచించాలని దేవుడు కోరుచున్నాడు? పరలోకం వెళ్లే మార్గం యొక్క ఆలోచన యేమిటి? ఫిలిప్పీ 4:6-8 **''దేనిని గూర్చియు చింత పడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థనా విజ్ఞాపనల చేత కృతజ్ఞతా పూర్వకంగా మీ విన్నపములు దేవునికి తెలియచేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును. మెట్టుకు సహోదరులారా యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటిమీద ధ్యానముంచుకొనుడి''.** దేవుని రాజ్య సంబంధులు ఈ విధంగా ఉండాలి. పరలోక రాజ్యంలో నిలిచి యుండాలంటే ఏది సత్యమో మనము ఆలోచింప బద్ధులమై యున్నాము.

యెషయా 65:16 **'' దేశములో తనకు ఆశీర్వాదము కలుగవలెనని కోరువాడు నమ్మదగిన దేవుడు తన్నాశీర్వదించవలెనని కోరుకొనును. దేశములో ప్రమాణము చేయువాడు నమ్మదగిన దేవుని తోడని ప్రమాణము చేయును. పూర్వము కలిగిన బాధలు నా దృష్టికి మరువబడును.అవి నా దృష్టికి మరుగవును.** గతంలో జరిగిన విషయాలమీద నీ మనస్సును నీవు నిలిపినట్లయితే, వాటిని గురించే ఆలోచిస్తావు. దేవుడు ఒక సిద్ధాంతమును మనకు బోధించాడు. క్షమించుట అనే సిద్ధాంతమును మనము నేర్చుకోవాలని ఆయన కోరుచున్నాడు. క్షమాపణ అనేది దేవుని రాజ్యానికి అతిప్రాముఖ్యమైనది. ఎవరైనా మనకు చేయరానిది చేసినట్లయితే వెంటనే వార్ని మనం క్షమించాలి.అది వారి పాపమును క్షమించును, అంతేకాకుండా మనకు నాశనం తెచ్చేపాపమును కూడా అది క్షమించును. ఒక వ్యక్తి నీకుకోపం పుట్టించినప్పుడు అతనితో పాటు నీవును కోపోద్రిక్తుడవైనట్లయితే, నీవు ఆత్మీయ రాజ్యంలోనుండి వైదొలగినట్లే. మనం విమర్శించడం గాని, దూషించడం గాని తీర్పుతీర్చడం గాని చేయరాదు అని యేసుక్రీస్తు వారు చెప్పారు. తీర్పు తీర్చడం అనగా యేమిటి? ఇతరులలో తప్పులను కనుగొని వాటివైపు చూపించడం. దేవుని ప్రేమ తప్పిదాలను ఎత్తి చూపించదు. ప్రేమ చెడును యోచించదు అనగా ఇతరులను గురించి చెడుగా ఆలోచించదు. ఫిలిప్పీ 4:8 **మెట్టుకు సహోదరులారా యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటిమీద ధ్యానముంచుకొనుడి''.** సత్యమైన వాటిని అని ఇక్కడ చెప్పబడుతుంది. యేసుక్రీస్తు వారు ప్రజలను ఏవిధంగా చూశారు? యోహాను సువార్త 8:10-11 **''యేసు తలయెత్తి చూచి, అమ్మా వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధింపలేదా అని అడిగినప్పుడు ఆమె లేదు ప్రభువా అనెను. అందుకు యేసు నేనును నీకు శిక్ష విధింపను, నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను.** శాస్త్రులు పరిసయ్యులు వ్యభిచారమందు పట్టబడిన స్త్రీని తీసుకుని వచ్చిరి. ఆమె యందు తప్పిదమును చూచారు, క్రీస్తుమీద నేరము మోపవలెనని ఆమెను ఆయన యొద్దకు తీసుకుని వచ్చారు. ఆయన యేమి చేస్తాడో చూడాలని వారి ఉద్దేశ్యం. ఆమె యేమి నేరం చేసిందో వారు ప్రతి ఒక్కరికి చెప్తున్నారు. క్రీస్తు మాత్రం యేమియు చెప్పలేదు. ఆయన నేలపై తన వ్రేలితో ఏదో వ్రాశాడు. ఆయన చేవ్రాలు దేవుని యొక్క వాక్యం మరియు ఆత్మ. ఆయన అక్షర రూపంలో వ్రాసిన వ్రాత వారి మనస్సులో ఉన్న అంతరాత్మను ఉద్దేశించి వ్రాసినది. ఇక్కడ ఉన్న వారిలో వారి జీవితంలో పాపము చేయని వారెవరైన ఉన్నట్లయితే, వారు ఆమెపై రాయి వేయవచ్చును అని ఆయన చెప్పాడు. ఆయన మాట వారి అంతరాత్మలను శోధించుట మొదలు పెట్టినప్పుడు ఆమెపై ఏ ఒక్కరూ రాయి వేయలేక పోయారు. నేనును నిన్ను తప్పుపట్టను, మరొక మాటలో శిక్షించను, వెళ్లు ఇక పాపము చేయకు అని ఆయన చెప్పాడు. ఆమె చేసిన పాపం గురించి ఆయన మాట్లాడలేదు మరియు ఆమె పట్ల పరిశుద్ధ గ్రంథ సారాంశమును ఆయన

ఉపయోగించాడు. అప్పటికప్పుడు ఇక పాపము చేయకు వెళ్లు అని చెప్పడం జరిగింది (యోహాను 8:11) అక్కడొక ప్రేమ రాజ్యాన్ని మనం చూస్తాం. ఆ ప్రేమ రాజ్యం ప్రజలను మారుస్తుంది. నీ వెప్పుడైనా గమనించావా? నీ స్వంత బిడ్డలు చేయచున్న చెడ్డపనులమీద దృష్టి యుంచి వాటి గురించి మాట్లాడినప్పుడు అది వారి మనస్సులో ప్రవేశించి నిజంగానే మనం చెడ్డవారము అనే భావన కలిగి దానిమీదే వారికి నమ్మకము ఎక్కువగును. మీరు చెడ్డవారు, తెలివిలేని వారు అని మాట్లాడుట వలన వారు ఎన్నటికీ యేమియూ నేర్చుకోలేరు. కొంతమంది అలాంటి ఆలోచనతోనే ఎదుగుచూ, వారు వేటినైతే విన్నారో వాటియందే లక్ష్యముంచుతారు. **ప్రేమ పాపములను కప్పును 1 పేతురు 4:8.** మొదట నీ సహోదరుల తప్పిదములను నీవు ఎత్తి చూపుట వలన లేదా వాటిని మనస్సు నందు లక్ష్య పెట్టుట వలన నీవు బాధకు గరియై, విసుగుచెంది కొన్నిసార్లు పిచ్చివాడిగా కూడా కనబడతావు. ఆ తరువాత అతనినుండి దూరంగా వెళ్ళిపోతావు. నేను ఎక్కవగా ఆలోచించి ఎక్కువగా బాధపడిన విషయాలను గురించి ఎక్కువగా ప్రార్థన చేయవలసిన అవసరం ఉందని నేను నేర్చుకున్నాను. దేవుని సేవకురాలిగా ఈ విషయాన్ని గురించి దేవుడు అనేక విషయాలు నాతో మాట్లాడియున్నాడు. ప్రార్థించుట, ఆలోచించుట మరియు బాధ పడుట ఇవేమీ కూడా వారిని మార్చలేదు. ప్రజలను ఆయన ఎలా చూస్తాడో అలాగే మనము కూడా చూడగలగాలని ఆయన కోరుచున్నాడు. ప్రభువా ప్రజలను నీవు ఎలా చూస్తున్నావు? అని అడిగాను. పేతురును జ్ఞాపకం చేసుకుందాం. యేసుప్రభువు వారు పేతురునొద్దకు వచ్చినప్పుడు నీవు సీమోనువు అని చెప్పడం జరిగింది. సీమోను అనే పేరు షిమ్యోను అనే పేరునుండి వచ్చినది మరియు వాక్యములో ఇలా చెప్పబడింది. **షిమ్యోను లేవి అనువారు సహోదరులు వారి ఖడ్గములు బలాత్కారము ఆయుధములు** (ఆదికాండము 49:5). అతడు షిమ్యోను జాతికి చెందిన వాడు. సీమోను కొన్ని సమయాలలో సహనాన్ని కోల్పోయాడు. ప్రభువును ఎరుగనని ముమ్మారు పలికాడు. యేసు అతని చూచెను అని పరిశుద్ధ గ్రంథం చెప్తుంది. నీవు ఎవరినైనా చూచినప్పుడు అతనిలోని మంచితనాన్ని చూడగలగాలి. యోహాను 1:42 **" యేసు అతని వైపు చూచి నీవు యోహాను కుమారుడవైన సీమోనువు, నీవు కేఫా అనబడుదువని చెప్పెను. కేఫా అనుమాటకు రాయి అని అర్థము").** మరొక మాటలో (నిన్ను సీమోను అని పిలువ కుండా రాయి అని పిలువబోవుచున్నాను అని అర్థము). దేవుడు ఎప్పుడూ కూడా పూర్తికావింపబడిన విషయాన్నే చూస్తాడు. దేవుడు ఎప్పుడూ కూడా చివరి ఫలితాన్ని మాత్రమే చూస్తాడు. ప్రస్తుతము సంఘము చూస్తున్న విధానములోనే నీవు కూడా చూస్తున్నట్లయితే నీవు మనస్తాపం చెందుతావు. కొన్ని సమయాలలో సంఘ సభ్యులను చూచినప్పుడు నీవు కలవరానికి గురి అవుతావు. చివరి ఫలితాన్ని మాత్రమే మనము చూడాలని దేవుడు కోరుచున్నాడు. మనం చేసే విధానంలో పరిస్థితులను ఆయన చూడడు. నేను గిద్యోను గురించి ఆలోచించాను. దూత వచ్చి ఈలాగు చెప్పెను. " దేవుని యొక్క అత్యంత శక్తి స్వరూపుడైన మానవుడా అంటున్నాడు. నిజానికి అతడు శక్తిస్వరూపుడు కాదు. అతడు అంటున్నాడు, నేను బలహీనుడను. నేను ఇల్లంతటిలో అల్పుడను, నన్ను పిలుస్తున్నావా ప్రభువా? లేని వాటిని కూడా పిలిచే దేవుడు ఆయన. మనం చేస్తున్న పనులన్నిటిని ఆయన విభిన్నమైనవిగా చూస్తున్నాడు. సర్వసృష్టి క్షమించబడాలని దేవుడు కోరుచున్నాడు. ఇతరులలో దోషములను కనుగొనుట మనం మానుకోవాలి. క్షమాపణ అనే రాజ్యంలో మనం పయనించాలి. ఈ మాట నా దగ్గరకు వచ్చినపుడు నేను దానిని నా మనస్సునుండి తొలగించలేకపోయాను. అక్కడ ఖైదీలు ఉన్నారు. వారు తమ కౄరత్వమునుండి వెనుదిరగలేదు. ఈ ఖైదీలు ఇపుడు దీన స్థితిలో ఉన్నారు. ఎందుకంటె వారు చేసిన తప్పిదములను బట్టి వారు మృత్యువుకు దగ్గరవ బోతున్నారు. వారు అక్కడకు వచ్చిన ఒక కవి పట్ల కోపంగా ఉన్నారు ఎందుకనగా అతడు చాలా సంతోషంగా ఉన్నాడు. వారున్నటువంటి పరిస్థితిలో అతడు జీవించలేదు. ఇలాంటి క్లిష్ట వాతావరణానికి అతడు తావివ్వలేదు. అతడు వాక్యాను సారమైన జీవితం జీవించాడు గాని వాస్తవంలో జీవించలేదు. వారు అతనితో అన్నారు, నీవు ఊహా జీవితంలో జీవిస్తున్నావు అని. కాని అది వాస్తవం కాదు. పరిస్థితులను పూర్తిగా భిన్నమైనవిగా అతడు గమనిస్తున్నాడు. నేనొక రాజును, ఏదైనా మార్పు చేయగలను అని అతడు విశ్వసించాడు. అతడు చెడును చూడకుండా మంచి వైపు మాత్రమే చూస్తున్నాడు. అన్ని సమయాలలోను సంతోషంగా ఉన్నాడు. అక్కడొక వ్యభిచారిణి ఉన్నది. వారందరు

ఆమె విషయమై హేళనగా చెప్పుకొనేవారు. అప్పుడతడు లోనికి వెళ్లి, ఆమె అందమైన ఒక కన్యక అని చెప్పాడు. వారందరూ ఒకేసారి కలవర పడ్డారు. వారు అన్నారు, ఆమె ఎలాంటిది అనుకున్నావు? నీవు వాస్తవికంగా జీవించడం లేదు అన్నారు. నీవు వెఱ్ఱివాడవు అని అన్నారు. వాస్తవంగా జీవించడంలో వెఱ్ఱితనం లేదు. నీకు కనబడే విషయాలను నీవు చూచినట్లయితే, నీవు పిచ్చివాడవు అవుతావు. నీవు సత్యంలో జీవిస్తున్నప్పుడు నీకు కనబడని అనగా అదృశ్యమైనవాటిని నీవు చూస్తావు. ఏది సత్యమో దాని గురించి ఆలోచించమని వాక్యం చెప్పుచున్నది. ఏది సత్యం? దేవుడు గమనించి చూసేదే ఆఖరి ఫలితం. సర్వసృష్టి యొక్క చిట్టచివరి ఫలితాన్ని దేవుడు చూస్తాడు. దేవుని సంఘం నిజాయితీగా ఉండాలని దేవుడు చూస్తుంటాడు. సంఘము అందంగాను, ఆయనకు మహిమకరంగాను ఉండాలని దేవుడు చూస్తుంటాడు. యేసుక్రీస్తు రక్తంతో లేదా రక్తం ద్వారా నింపబడాలని దేవుడు చూస్తున్నాడు. మన ప్రసంగాల ద్వారా ఇతరుల దోషములు ఎత్తి చూపి, ఆత్మీయ రాజ్యంలో ఉండాలనుకుంటె, నీకు ప్రసంగించే అనుమతి ఇవ్వబడదు. దాని అర్థం, నీవు ఎవరిలోనైనా కొన్ని చెడు సంగతులు చూచినప్పుడు అవి ఇతరులకు వెల్లడించరాదు. నీవు ఆత్మీయ రాజ్యములో నిలిచియుండాలని కోరినట్లయితే, నీవు ఇచ్చే రిపోర్టు మంచి రిపోర్టు అయి ఉండాలి. చెడు రిపోర్టు వల్ల యేమి జరుగుతుందో దేవుడు నాకు చూపించాడు. కొన్ని వారముల క్రితం ఒక వ్యక్తి నేను ఉన్న చోటుకు రావడం జరిగింది. అక్కడ జరుగుచున్న అన్ని మంచి విషయముల గురించి ప్రభువు నాకు తెలియచేశాడు. అప్పుడు వారు నాకు ఒక చెడు సమాచారం చెప్పడం వలన ఆ గదిలో ఉన్న మంచి వాతావరణం అంతా మార్పు చేయబడింది. మనం జీవం గురించి మాట్లాడాలని దేవుడు కోరుచున్నాడు. మనం మన జీవితాలను గురించి ఆలోచించాలని దేవుడు కోరుచున్నాడు. మనం జీవాన్ని కలిగియుండాలని, అది సమృద్ధిగా కలిగియుండాలని కోరుచున్నాడు. మనం సమృద్ధియైన జీవితాన్ని కలిగి యుండాలంటే ఇప్పుడు మనం ఆలోచిస్తున్న ఆలోచనల్ని మానుకోవాలి. ఇతరులకు తీర్పు చెప్పేవాడిగా నీవుంటే పరలోక రాజ్యంలో చేరలేవు. తీర్పు తీర్చుట అనగా దోషములను వెదుకుట లేక కనిపెట్టుట. ఇతరుల దోషములను గురించి నేను ఇక మాటలాడను అని నీవనుకుంటావు. మనలో కొంతమంది నోటికి పెద్ద కళ్ళెం అవసరమై ఉంది. అది తప్ప మనం చేయగలిగింది లేదని నేను గ్రహించాను. దేవుడు లేకుండా మనం యేమి చేయలేము. దేవునితో మనం యేమైనా చేయగలం. యేసుక్రీస్తులో మనం అన్నీ చేయగలం. ప్రేమ ఎన్నడు విఫలం కాదు అని నాకు తెలుసు. నేను లోర్టన్ జైలు వద్దనున్నప్పుడు దేవుడు నన్ను జ్ఞాపకం చేసుకున్నాడు. బ్రదర్ గ్రే అనే అతను వల్ల మేము చెడు సమయాన్ని కలిగి యుండవలసి వచ్చింది. నీవు అతనిని ప్రేమించు అని దేవుడు చెప్పిన కారణంగా రెండు సంవత్సరములు మేము అతనిని ప్రేమించితిమి. ఇప్పుడతడు మమ్మును ప్రేమిస్తున్నాడు. ఇది సంతోషించదగిన మరియు అందమైన విషయం కాదా? నీవు నవ్వు ముఖం పెట్టుకుని నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని ఎవరితో నైనా చెప్పగలవు. కాని నీ ఆలోచనలు నీ మాటల కంటె ఎక్కువగా శబ్దం చేస్తాయి. ఆ వ్యక్తి నీవు యేమి ఆలోచిస్తున్నావో వాటిని ఊహించగలడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను సహోదరి జాయిసీ అని చెప్పేవారు నాకు ఉన్నారు కాని వారి మనసునుండి శరీరము నుండి బైటకు వచ్చేది యేదో అది నేను తెలుసుకోగలను కాని నేను అలాంటి వాటిమీద ఆధారపడాలని దేవుడు కోరడం లేదు.

యేసుక్రీస్తు ఎన్నడూ శక్షించలేదని దేవుడు నాకు చూపించాడు. కనీసం 5 గురు భర్తలు కలిగిన ఒక స్త్రీ తప్పిదము విషయమైనను ఆమెను శిక్షించలేదు. శిష్యులు వచ్చినప్పుడు, క్రీస్తు ఆ వ్యభిచార స్త్రీతో మాట్లాడుట చూచి, ఒక పాపితో క్రీస్తు మాట్లాడుచున్నందుకు అత్యంత కోపం చెందారు. కాని యేసు వారిని గమనించి, ఆ విషయమై యేమియు మాట్లాడలేదు. ''హలో, శిష్యులారా, నేను ఈమెతో మాట్లాడుచున్న విషయమై మరేమైనా మంచి వార్త వినగోరుచున్నారా? ఆమె 5 గురు భర్తలను కలిగియున్నది''. లేదు ఆ విషయమై వారితో యేమియు చెప్పలేదు. మీ విమర్శలు, వెనుకనుండి గుసగుసలు, లేనివాటిని కల్పించి చెప్పడం ఇలాంటివన్నీ మానివేయాలి. తప్పులు పట్టే విధానం మానుకోవాలి. మీరు మీ స్వంత తప్పిదాలు కలిగియున్నారు. మీ స్వంత తోటను పోషించుకోండి. నేనొక తోటను కలిగియున్నాను. ఆ తోటలో చాలా ఎక్కువ పని ఉంది. నీవు దానిని శ్రద్ధగా పోషించనిచో, నీ తోటలో గురుగులు ముండ్ల పొదలు పెరుగుట ప్రారంభించును. నీవు ఇతరుల తోటలో ఇలాంటివి పెరగాలని ప్రయత్నిస్తే,

అంతకంటె ఎక్కువగా నీ తోటలో పెరిగి వాటిని కూడా పోషించవలసిన స్థితి నీకు కలుగుతుంది. నీ కంటిలో ఉన్న దూలమును తీసివేసికొనుటకు మొదట ప్రయత్నించుము. అపుడు నీవు ఇతర సోదరులకు సహాయపడగలవు. అతని శిక్షించకు గాని ప్రేమించు. ఎందుకనగా ప్రేమ మనుష్యులను మార్చును. ఇతరులలో ఉన్న మంచిని వెదకి, ఆ మంచిని గురించి వారికి తెలియచెప్పాలి. ఈ విధంగా చేసినప్పుడు, నీలో ఉన్న దేవుని ప్రేమ వైపుకు వారు ఆకర్షించబడతారు. అప్పుడు నీవు దేవుని వాక్యాన్ని వారికి బోధించుట ప్రారంభించగలవు. దేవుని వాక్యాన్ని బోధించుటలో దేవుని ఆత్మచేతనైన బోధ కానియెడల అది యే రకమైన మంచి చేయజాలదు.

ప్రకటన గ్రంథంలో 2 వ అధ్యాయము 2, 4, 5 వచనములు, యేసు ఏడు సంఘములనుద్దేశించి మాటలాడినప్పుడు మొట్టమొదటిగా ప్రతి సంఘములోను ఏది మంచిదో దాని గురించి ఎల్లప్పుడూ మాట్లాడియున్నాడు. ఆయన ఈ విధంగా చెప్పాడు, **"నీ క్రియలను, నీ కష్టమును, నీ సహనమును , నేనెరుగుదును. నీవు సహనము కలిగి, నా నామము నిమిత్తము భారము భరించి అలయలేదనియు నేనెరుగుదును. అయినను, మొదట నీకుండి ప్రేమను, వదలితివని నేను నీ మీద తప్పు ఒకటి మోపవలసియున్నది"**. ఆయన సంఘములో జరుగుచున్న ప్రతి మంచి విషయమును ఎత్తి చూపి, ఆయనకు వ్యతిరేఖముగా ఉన్నదానిని తక్కువగా చూపించడం జరిగింది. అక్కడ దేవుని ప్రేమను మీరు గమనించారా?ఆయన మంచి వాడు కాదా? ఈ నీతి సూత్రాలను మనం నేర్చుకోవాలని దేవుడు కోరుచున్నాడు. దేవుని విధానము పని జరిగించును. మన ఆలోచనలు మార్పు చేయబడాలని దేవుడు కోరుచున్నాడు. ప్రేమ రాజ్యంలో మనం నడచినట్లయితే, ఆత్మలో నిలిచే సామర్థ్యం మనకు కలుగుతుంది. దోషాలవైపు మనం చూడకూడదు గాని, చివరి ఫలితాన్ని చూడగలగాలి అనగా దేవుడు మొదలుపెట్టిన పని ఏ విధంగా పూర్తి చేయనైయున్నాడో దానిని చూచుటకు వేచి యుండాలి. మన పరిస్థితులన్నీ అందంగా చూచుటకు దేవుడు కోరుచున్నాడు. నీవు దేవుని ఆత్మలో నిలిచియున్నప్పుడు, సణుగుట గాని, ఫిర్యాదు చేయుట గాని చేయవు. ఏ విధమైన మినహాయింపులు నీవు చేయలేవు. నేను దేవుని అడిగాను, దీని ఆంతర్యం, నేను మంచి వార్తలు తేవాలని, ఊహించాలని, మంచి సంగతులు గురించి ఆలోచించి మాట్లాడాలని, మంచి రిపోర్టు ఇవ్వాలనే కదా ప్రభువా? ఎవరైనా వచ్చి ఎవరి గురించైనా చెడు రిపోర్టు ఇచ్చినప్పుడు నేను దానిని ఎలా హ్యాండిల్ చెయ్యాలి? దేవుడు అన్నాడు, విషయమును మార్చి అతడు చెప్పుచున్నదానిని అతడు మరచిపోయేటట్లు చేయాలి. వేరే విషయాన్ని నీవు చెప్పుచున్నప్పుడు అతడు తను చెప్పదలచుకున్న విషయాన్ని మర్చిపోతాడు. మనం మంచి మాటలు మాట్లాడాలని దేవుడు కోరుచున్నాడు.

**"సువార్త ప్రకటించుచు సమాధానము చాటించుచు సువార్తమానము ప్రకటించుచు రక్షణ సమాచారము ప్రచురించుచు వాని పాదములు నీ దేవుడు ఏలుచున్నాడని సీయోనుతో చెప్పుచున్న వాని పాదములు పర్వతముల మీద ఎంతో సుందరములై యున్నవి"**. నీవు దేవుని ఆత్మలో నిలిచియుంటే ఎన్నటికి ఫిర్యాదు చేయలేవు. ఎంతమంది దేవుని శక్తిని కోరుకుంటున్నారు? గాలి బుడగను ఎప్పుడైనా చూశావా? నీవు సణుగుకున్నప్పుడు, ఫిర్యాదు చేయునప్పుడు ఏం జరుగుతుంది? నీ బుడగను నీవే పేల్చేసుకున్నట్టవుతుంది. సణుగుకొనుట, ఫిర్యాదు చేయుట నీస్థితిని మార్చలేవు. నీ స్థితిగతులు సుందరమైనవి. ఎక్కడైతే ప్రతీది సుందరంగా ఉంటుందో అక్కడ దేవుని ఆత్మలో మనల్ని ఉన్నత స్థితికి తీసుకు రావాలని దేవుడు ప్రయత్నించు చున్నాడు. మన స్థితిగతులన్నిటిని సుందరంగా చూసినప్పుడు మాత్రమే దేవుని స్తుతించి, ఆరాధించి, కృతజ్ఞతలు తెలియచేయగలం. ఫిర్యాదులు చేసే స్వభావం కృతజ్ఞతలు చెల్లించేదిగా మారాలని దేవుని కోరిక. ఎందుకంటె దేవుని వాక్యం చెప్పుచున్నది, **"ప్రతి విషయములోను దేవునికి కృతజ్ఞతలు చెల్లించుట దేవుని చిత్తమై యున్నది"**. రూపాంతర కొండపైకి ఎవరు వెళ్లారో జ్ఞాపకం చేసుకో విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ. నీవు సణుగుకొనుట, ఫిర్యాదులు చేయుట చేస్తే, నీవు దేవుని యందు నమ్మిక యుంచుట లేదు. నీకు ఎవరైనా ఏదైనా చేసినప్పుడు నీవు దేవునికి చెప్పి ఫిర్యాదు చేస్తావు. ఆ ఫిర్యాదును దేవుడు ఆలకించడు. దేవునిలో నీకు గొప్ప శక్తి కావాలని కోరుకున్నట్లయితే, ఈ రోజునుండి ఫిర్యాదులు చేయడం మానుకో.

కొంతమంది ప్రజలు నాతో చెప్పారు.

సిస్టర్ జాయిసీ, నీవు చెప్పిన మార్గంలో నేనుండనందుకు నేను ఏడ్చి ఏడ్చి నా బలమును వ్యర్థపరచుకున్నాను. నా శరీరములో జీవమునకు బదులు చావు పనిచేసినది. నా స్థితి గతులు అందంగా నేను చూచినట్లయితే, నేను సంతోషంగా ఉండేదాన్ని అని చెప్పిన వారున్నారు. నవ్వుచుండుట, సంతోషించుట నీ శరీరానికి మెడిసిన్ లాంటివి. నీవు డిప్రెషన్‌లో ఉన్నప్పుడు నీవు మరణమునకు సిద్ధమవుదువు. ఈ అంశములపై యోచించుటకు మనము ఉద్దేశించబడ్డాము. చెడు విషయములు గురించి ఇక ఎన్నడూ నేను ఆలోచించను అని మీరు అనుకుంటున్నారా? ఔను నీవు వాటిని మంచిగా దాటిపోవాలి. అది ఎలా చేయగలవు? ఈ వాక్య భాగాన్ని జ్ఞాపకం చేసుకో. ఆదికాండము 6:2 **"దేవుని కుమారులు నరుల కుమార్తెలు చక్కని వారని చూచి, వారందరిలో తమ మనస్సుకు నచ్చిన స్త్రీలను వివాహము చేసుకొనిరి"** దాని అర్థం వారు పంచేంద్రియాలను అనుసరించి వెళ్లారు, దాని ప్రకారం జీవించారు. వారు చూచిన ప్రతీది చెడ్డదే. వారి మనసుల్లో చెడును స్థిరపరచుకున్నారు. మనసులో చెడును కలిగియున్నప్పుడు అందవికారమైన ఆలోచనలు బయటకు వస్తాయి. బాధపడుట, అవిశ్వాస్యత , ఫిర్యాదులు చేయుట, ఇతరుల దోషములను కనిపెట్టి చూచుట అనేవి అన్నీకూడా చెడుకు లేదా అపవాదికి సంబంధించినవే. దేవుని వాక్యానికి విరోధమైన ప్రతీది కూడా అపవాదికి సంబంధించినదే.

నేను సకల శరీరులను నాశనం చేయబోవుచున్నాను అని దేవుడు చెప్పాడు. ఆయన మాటను నెరవేర్చడం కొరకు భూమిని నీళ్ల ప్రవాహంతో నింపివేశాడు. దేవుడు ఆయన వాక్యం ద్వారా, ఆయన ఆత్మ ద్వారా మన ఆలోచనల్ని భగ్నం చేయదలిచాడు. వారం వెంబడి వారం మనం దేవుని సన్నిధిలో ఉన్నప్పుడు ఆయన వాక్కు ద్వారా, ఆయన ఆత్మ ద్వారా మన మనసులు కరిగేలా చేస్తున్నాడు. ఆయన మన మనసులను కడిగివేస్తున్నాడు మరియు మన ఆలోచనల్ని, వైఖరిని మార్చి వేస్తున్నాడు. ఇతర విషయాల పట్ల మనం చూసే మార్గాన్ని విధానాన్ని మార్చబోతున్నాడు. దేవుడు మనల్ని చూసినట్లే, మనం ఇతరులను చూడాలని మన మనసులను మారుస్తున్నాడు. దేవుడు చీకటిని, వెలుగును ఒకే రీతిగా చూస్తున్నాడు. నోవహు కాలంలో ఉన్న ప్రజలపై దేవుడు కోపపడ్డాడు, ఎందుకంటె ఇప్పుడు మనమెలాంటి చెడు తలంపులను, ఊహలను కలిగియున్నామో అలాంటి వాటినే వారును కలిగియున్న కారణమును బట్టి. 2 వ కొరింథీ 10:4-6 **"మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావు గాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయు జాలినంత బలము కలవై యున్నవి. వేము వితర్కములను, దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి మీరు సంపూర్ణ విధేయతను కనుబరచినప్పుడు సమస్తమైన అవిధేయతకు ప్రతి దండన చేయ సిద్ధపడియున్నాము".**యేసు క్రీస్తులో నీవు అన్నిటిని చేయగలవు. దేవునితో నీకు అసాధ్యమైనది యేదియూ ఉండదు. దేవుని ఆత్మనుండి మనలను వేరు చేసేటటువంటి ఆలోచనలను బట్టి మనము శాంతిని కోల్పోయే పరిస్థితికి వస్తాము. మనము శాంతిని కోల్పోయినప్పుడు ఇతరులను తప్పుడు విధానంలో చూడటం, మన పరిస్థితులను తప్పుడు వైఖరితో చూచుట మొదలు పెడతాము. మనలో వస్తున్న చెడు ఊహలను దేవుని వాక్యంతో మంచి ఆలోచనలుగా మార్చుకోగలగాలి.

ఒక వ్యక్తి యొక్క దోషములను మరియు వారిలో ఉన్న చెడును చూచుట మొదలు పెట్టినప్పుడు నీలో కలవరము, విసుగు, నిరుత్సాహము కూడా మొదలౌతుంది. నీలో ఈ పరిస్థితికి కారణమైనది యేదో అది దేవుని నుండి వచ్చినది కాదు అనే విషయాన్ని నీవు వెంటనే తెలుసుకోవాలి. దేవుడు ఎప్పుడూ మనలను బాధకు గురి చేయడు. నిరుత్సాహపడే పరిస్థితి నీకు తటస్థించినప్పుడు నీవు తప్పు చేశావు అనే విషయాన్ని తెలుసుకోవాలి. ఇతర వ్యక్తి గురించి మనం యేమి ఆలోచన చేశామో దానిని పరిశీలన చేసుకోవాలి. ఆ వ్యక్తిలో ఉన్న మంచి విషయాలను బయటకు రాబట్టడానికి ప్రయత్నించు. ప్రతి ఒక్కరిలోను మంచి అనేది ఉంది. మనలో ప్రతి ఒక్కరికి దేవుడు యేమి చేస్తానని చెప్పాడో దానిని జ్ఞాపకం చేసుకోవాలి. ఆ వ్యక్తి యొక్క చివరి ఫలితాన్ని చూడు. ఎన్ని సంవత్సరాలు సమయం తీసుకుంటుందో దానిని గురించి ఆలోచించకు. కొన్ని సమయాలలో మార్పు చూడటానికి చాలా సమయం పట్టవచ్చు. ప్రేమ దీర్ఘకాలము సహించును మరియు అది ఎన్నటికీ విఫలము కానేరదు.

"నేను చాలాకాలము ప్రేమించాను కాని ఇంకా మార్పును చూడలేదు అని

నేను తలంచేదాన్ని". దేవునిలో సమయం లేదు. ఆయన చివరి ఫలితాన్ని చూస్తాడు. మార్పు రావడానికి వంద సంవత్సరాలు పట్టినప్పటికి, ఆయన చివరి ఫలితాన్ని మాత్రమే చూస్తాడు. ఇప్పుడు జరుగుచున్నవాటిని కాదు చివరిఫలితాన్ని చూడటం. ఇది చాలా భారమైన విషయం కాని ఇది నిజం.

మీకు ముందు చెప్పినటువంటి విషయం దగ్గరకు మరల వస్తాను. ఆ స్త్రీని గురించి ఆ వ్యక్తి చెప్తున్నాడు, ఆమెను గురించి మంచి ఆకారమును మనస్సునందు ఉంచుకొని,ఆమె చాలా అందమైనది, కన్యక అని చెప్పుచున్నాడు. యేసు వైపు నీ కన్నులు ఉంచి, వారు చేస్తున్నవాటిని నీవు చూస్తూ ఉన్నప్పుడు నీవు నీ సహనాన్ని కోల్పోవు, బాధకు గురి అవ్వవు దానికి కారణం దేవుని స్వాధీనంలో ఉన్నావు. ఆ వ్యక్తి మాటలు వింటున్న వారు అతనితో వాస్తవమనే అద్దంలో చూడమని చెప్పారు. మరొక మాటలో యేమిటంటే ఆత్మీయ రాజ్యమునుండి నీ కళ్లను వెలుపలికి పెట్టి పరిస్థితుల వైపు చూడు. వాస్తవికత వైపు చూడు. ఆమె ఒక వ్యభిచారిణి అన్నారు. వాస్తవము అనే అద్దంలో అతడు చూచుట మొదలు పెట్టినప్పుడు అతడు ఆత్మీయ మరణములో మునిగిపోడం ప్రారంభమైంది. మనం ప్రేమ రాజ్యం నుండి వేరుపడినప్పుడు ఖచ్చితంగా అదే జరుగుతుంది. పరిస్థితుల వైపు మనం దృష్టి సారించినప్పుడు ఆత్మీయంగా మరణించుట ప్రారంభమగును. ఆమె పరుగెత్తుకుని పోయి అతని చేయి పట్టుకొని చెప్పింది. నీవు చెప్పినట్లే నేను కన్యను. నీవు చెప్పినది నేను నమ్ముచున్నాను అని అతనికి బోధించి అతనికి జీవాన్ని తెచ్చింది. అతడు పరిస్థితులను అధిగమించగలిగాడు. **"ప్రేమ అనేక పాపములను కప్పును".** నోవహు గురించి నేను ఆలోచించాను. ఆదికాండము 9:23. ఒక కుమారుడు పరుగెత్తుకుని పోయి తన తండ్రి నోవహు చేస్తున్నదాని గురించి తన సోదరులకు చెప్పెను. కాని ఆ యిద్దరు సోదరులు తమ తండ్రి దిసమొలను వస్త్రముతో కప్పిరి. మనం దేవుని వలె ఆలోచించాలని, ఆయన వలె మాట్లాడాలని, ఆయన జీవించినట్లు జీవించాలని దేవుడు కోరుచున్నాడు. ఆ విధంగా జీవించడానికి ఒకే ఒక మార్గం యేమిటి అనగా ప్రజల యెడల నీ రియాక్షన్స్, నీ వైఖరి, నీ ఆలోచనలు మార్పు రావడానికి అవసరమైన నీ మనస్సును నూతన పరచడానికి దేవునికి నీవు అవకాశమివ్వాలి. మత్తయి 22:37 చూడండి **''నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ మనసుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెనను నదియే''.** (దేవుడు ఆయనలాంటి హృదయం గల వారి కొరకు ఎదురు చూస్తున్నాడు). నీ ఆత్మ దేవుని ఆత్మతో వివాహం చేయబడినప్పుడు అది ఒక వివాహం, ఐఖ్యత మరియు ప్రేమ వ్యవహారం. పంచేంద్రియాలతో వివాహం చేయబడలేదు. నీ ఆత్మ దేవుని వాక్యము మరియు దేవుని ఆత్మతో వివాహము చేయబడినప్పుడు నీ చుట్టూ యేమి జరుగుచున్నప్పటికి నీవు దేవుని వాక్యము మీద నిలబడతావు. వాక్యము ఈ విధంగా చెప్పుచున్నది కాబట్టి దేవుని వాక్యాన్ని నమ్మి నేను ఈ విధంగా చెప్పుచున్నాను అని నీవు చెప్పగలుగుతావు. **నీ పూర్ణ మనస్సుతో దేవుని ప్రేమించమని** దేవుని వాక్యము చెప్పుచున్నది. పూర్ణ మనసుతో దేవుని ఎలా ప్రేమిస్తాము? ఆయన బోధించిన ప్రకారముగా ఆలోచిస్తూ మన మనసు యొక్క అన్ని భాగాలతోను ఆయనను ప్రేమించాలి. ఫిర్యాదులు చేస్తూ సణుగు కున్నప్పుడు నీవు ఆయనను ప్రేమించలేవు. నీవు సణుగుకుంటూ ఇతరుల గురించి చెడుగా ఆలోచించినప్పుడు నీవు ఆయనను ప్రేమించుట లేదు. పూర్ణ మనసుతో దేవుని ప్రేమించడం అనగా దేవుడు ఆలోచించినట్లు ఆలోచించడమే. ఇది నూతన మార్గంలో జీవించడం, నూతన మార్గంలో పనిచేయడం అవుతుంది. ఇది మొత్తానికి ఒక క్రొత్త రకమైన జీవితం, ఇలాంటి జీవితం జీవించడానికి ఒక రాత్రికి రాత్రే దీనిని నేర్చుకొనలేవు. ఇది క్రమ క్రమంగా దేవుడు నీలో చేసే క్రియ.

రెండవ ఆజ్ఞ యేదనగా **నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అనునది**. నా పొరుగు వారు ఎవరో దేవుడు నాకు చూపిస్తున్నాడు. ఇది మీ ద్వారా కూడా పొందగలనని ఆశిస్తున్నాను. నీ తరువాత వారు ఎవరైనా సరే అతడు నీకు పొరుగు వాడు. దాని అర్థం, రక్షణ పొందని వాడైనా సరే. నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించడం అనగా నీ పొరుగువాడు నీలో ఒక భాగమై యున్నాడని ప్రేమించాలి, ఎందుకనగా ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ కూడా దేవుని నుండి వచ్చినవారే, అందుచేత వారు నీలో ఒక భాగం. నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే వారిని కూడా ప్రేమించాలి. దేవుడు చూపించిన మార్గంలో వారి కొరకు పనిచేయి. ఈ సిద్ధాంతమును ప్రభువు నాకు చాలా సామాన్యముగా మరియు విపులముగా బోధించాడు. ఒక వారం నేను సరకులమ్మే

దుకాణమునకు వెళ్లియుంటిని. ఆ దుకాణానికి వచ్చిన ప్రతి వారు నాలోని భాగమేనని గ్రహించడం మొదలు పెట్టాను. ఆయన శిరస్సు, మనమందరము శరీరము. ప్రతి ఒక్కరూ సభ్యులు మరియు శరీర భాగాలే. ఒక వ్యక్తిని నీవు చూచినప్పుడు వారు నీకేమి చేయాలని నీవు కోరుకుంటావో నీవు కూడా అదే ప్రకారం వారికి చేయగలగాలి. నీవు బయటకు వెళ్లినప్పుడు ఇతరులు నీలో ఒక భాగమని గ్రహించి, ఇతరుల పట్ల ఒక సదవగాహన కలిగియుండాలి. నేను ఒక దుకాణంలో ఉన్నాను, ఒక స్త్రీ ఇద్దరు చిన్న పిల్లలతో ఉంది. ఒక పాప ఏడుస్తుంది, మరొక పాప బండిలో నుండి సామానులు తీస్తుంది. అప్పుడు నేను అనుకున్నాను, నేను అదే స్థితిలో ఉన్నట్లయితే నాకు ఇతరులు యేమి చేయాలని కోరుకుంటాను? ఎవరో ఒకరు వచ్చి నాకు సహాయపడాలని కోరుకుంటాను. సాధారణంగా మనము అక్కడ ఉండి చూస్తూ ఉంటాము. కాని దేవుడు ఆ స్త్రీకి సహాయపడటానికి నన్ను అక్కడకు నడిపించాడు. ఆమె ఎంతో కృతజ్ఞురాలయ్యింది. దేవుడు నిన్ను దీవించును గాక అని చెప్పింది. వారి యెడల నీ నుండి వచ్చే దేవుని ప్రేమ యొక్క కదలికలు వారనుభవిస్తారు మరియు అది ఏ విధంగా వారిని తాకుతుందో అది దేవునికే తెలుసు. దేవుడు యేమి చేస్తాడో అది నీకు తెలియదు. నీవు ఎవరికైనా ఏదైనా చేసినట్లయితే అది క్రీస్తు కొరకు చేసినట్లే.

యేసు ఈ ఉదాహరణ ద్వారా ఇలా చెప్పాడు, **నేను రోగిగా ఉన్నప్పుడు నీవు నన్ను పరామర్శించితివి. నేను ఖైదీనై యున్నప్పుడు నీవు నన్ను దర్శించావు. నేను దిగంబరిగా ఉన్నప్పుడు నీవు నాకు వస్త్రము ధరింపచేశావు.** వారు అన్నారు, కాని ప్రభువా, ఎక్కడ నీవు ఈ స్థితిలో ఉన్నావు? ఆయన సమాధానం చెప్పాడు, నీవు ఈ దీనస్థితిలో ఉన్నవానికి చేసినట్లయితే నాకు చేసినట్లే. మనల్ని మనం పరిమితం చేసుకుంటాం. వారు వ్యభిచారులు, దొంగలు, అబద్ధికులు అని అనుకుంటాం. వారు కూడా క్రీస్తు శరీరంలో భాగస్వాములే. ప్రజలు వారి వారి అవసరతలో ఉన్నట్లు ప్రభువు నాకు దినమెల్ల చూపించుచున్నాడు. ఒక వ్యక్తి తన సరకులను తనొక్కడే బండిలో వేసుకొనలేడు. అందుచేత మేము వెళ్లి సహాయపడ్డాము. అలా చేసినప్పుడు నీవు ఒక పిచ్చివాడివి అన్నట్లు చూస్తారు. పూర్తిగా ఒక క్రొత్త వ్యక్తి వచ్చి సహాయపడతాడు. నా అంతట నేను మంచి పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నించుట లేదు. అసలేమి జరుగుచున్నదో నీవు గమనించాలని నేను కోరుచున్నాను. నీవు ఏ పంటను అయితే విత్తుతావో అదే పంటను కోస్తావు. ఆ వ్యక్తికి నీవు యేమి చేస్తున్నావో (విద్య, సాహిత్యపూర్వకంగా లేదా అక్షర సత్యంగా, క్రీస్తు ద్వారాను, క్రీస్తుకు నీవు చేస్తున్నావు). అది నీకు తిరిగి వస్తుంది. అవసరతలు కలిగియున్నవారు మన మార్గంలోనికి రావాలని మనం వారి యొద్దకు వెళ్లి సహాయపడాలని దేవుడు ప్రతి దినము ప్రజలను అనుమతించు చున్నాడు. ఒక కుర్రవాడు పనిచేస్తుంటే అతని చేతులు బిగుసుకుపోతున్నాయి. నేనొక సలహా చెప్పాను. వెళ్లి కొన్ని గ్లౌజులు కొని రప్పించమని. అతడు నమ్మలేక పోయాడు గాని ఎవరో ఒకరు పరిచయం లేనివారు వానికి ఒక జత గ్లౌజులు ఇవ్వాలని కోరుకున్నాడు. నిన్ను అంచనా వేయడానికి వారు ప్రయత్నిస్తారు కాని వారికి అర్థం కాదు. నీవు ఏదో ఒక సహాయము ఇతరులకు చేస్తున్న ప్రతి సారి క్రీస్తు శరీరమునకు (సంఘము) కొరకు చేస్తున్నావు. నీవు శరీరానికి చేస్తున్నావు అది తిరిగి నీ శరీరానికి మాత్రమే కాదు నీ తల వరకు కూడా వర్తిస్తుంది. నీవు ఇతరుల కొరకు చేసే ప్రతి దయగల పని కూడా క్రీస్తుకు చేసినట్లే అవుతుంది. ఎందుకంటె ఆయన శిరస్సు, మీరు శరీరము కాబట్టి శరీరంలో యేమి సంభవించిన అది శిరస్సుకు వెళుతుంది. ప్రజల గురించి మంచిగా ఆలోచించిన ప్రతి సమయము యేసుకు తెలుసు ఎందుకనగా అది ఆయనకు వర్తిస్తుంది.

ఒక రోజు చివరి సమయంలో దేవుడు నా కిచ్చిన దానిని ఇతరులకు పరిచర్యచేయటలో ఆలస్యమయ్యింది. ఒక స్త్రీ, ఒక బాలుడు మరియు ఒక పురుషుడు నా కంటె ముందున్నారు. ఆ స్త్రీ నన్ను చూచింది. నాకేమీ అనిపించలేదు కాని ఆమె నుండి ప్రేమ వ్యక్త మగుచున్నది. ఆమె పూర్తిగా క్రొత్త వ్యక్తి. కాని ఆమె పరుగెత్తుకుని పోయి ఆ యిద్దరి మనుష్యులకు నా దారినుండి తొలగిపొమ్మని చెప్పింది. సరకులిచ్చే స్థలానికి నేను చేరుకోగా ఒకతను చాలా కాయగూరలతో కనిపించాడు. నేను ఒక సరకు మాత్రమే కొనవలసి యున్నది కాని అతడు చెప్పాడు నాకంటె ముందుగా వెళ్లు అని. నా ప్రజలకు నీవు యేమి చేశావో అది నీకు తిరిగి ఇస్తున్నాను అని దేవుడు నాతో మాట్లాడుట ప్రారంభించాడు. నీవు దేవుని మనస్సు కలిగి యున్నప్పుడు, సమయం తీసుకుని యేమి జరుగబోతుందో వేచి చూడు. క్రీస్తు మనస్సు కలిగియుండుట అనగా అర్థం యేమిటి?

ఫిలిప్పీ 2:4 చూద్దాం. **"మీలో ప్రతి వాడును తన సొంత కార్యములను మాత్రమే గాక ఇతరుల కార్యములను కూడా చూడవలెను. క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సును మీరును కలిగియుండుడి".** మనము ఇతరుల అవసరాల పట్ల శ్రద్ధ కనుపరచడానికి ప్రారంభించినప్పుడు మన స్వంత కార్యములపై ఉన్న దృష్టి తొలగిపోవును. మనం ఇతరులకు సహాయం చేసినప్పుడు మన చుట్టు ఉన్నవారు మనకు పరిచర్య చేయునట్లు దేవుడు వారిని మన వైపు త్రిప్పును. అది దేవుని రాజ్య సిద్ధాంతము. మనం ప్రేమ రాజ్యంలో నడచినపుడు, ఆ మార్గంలో ఆలోచించినపుడు, యేసుక్రీస్తు మనసు ద్వారా దేవుని రాజ్యం భూమీమ్మద స్థాపించబడుతుంది.

ద్వేషము, హత్య ఏ విధంగా జరుగుతుంది? మన మనస్సులో ఆలోచన ప్రారంభమై అది శరీరము ద్వారా ప్రత్యక్షపరచబడుతుంది.మన మనస్సులో చెడును గురించి ఆలోచించినప్పుడు అపవాదిని బలపరచినట్టే. మంచిని గురించి ఆలోచించినపుడు దేవుని రాజ్యం భూమీమ్మద స్థాపించబడును. ఈ భూమీమ్మద దేవుని రాజ్యం స్థాపించబడాలని దేవుడు మనల్ని కోరుచున్నాడు. మీతో ఒక విషయాన్ని పంచుకోవడానికి ఇష్టపడు చున్నాను. న్యూజెర్సీ లో ఒకతను ఉన్నాడు. ప్రేమ చెడును యోచించదు కావును నీవు చెడు వైపు చూడవద్దు అని దేవుడు చెప్పుచున్నాడు అని అతడు మాతో పంచుకున్నాడు. ప్రేమ రాజ్యంలో నడవమని దేవుడు అతనికి బోధించాడు. ఒక రోజు తన ఇంటికి వచ్చినప్పుడు వాహనములు భద్రపరచే గది తలుపు తెరచి యుండుట చూచాడు. ఎవరో గదిలో ప్రవేశించి తన సామాగ్రిని దొంగిలించుటకు ప్రయత్నించుచున్నారని తెలుసుకున్నాడు. దేవుడతని మనసును తొందర పెట్టి, ప్రేమ రాజ్యంలో నడవమని చెప్పాడు. నేనెలా నిన్ను చూస్తున్నానో నీవును అతని అలాగే చూడమని చెప్పాడు. లోనికి వెళ్లి అతన్ని యేమి అనలేదు. నీవు యేమి చేస్తున్నావో నీవు గమనించావా అని అతన్ని ప్రశ్నించాడు. నేను నీకు సహాయం చేయునా అని అడిగాడు. నీ కొరకు నేను చేయగల పని అక్కడ యేమైనా ఉందా? అని అడిగాడు. ఆ మంచి మాటలు దొంగ మనస్సును కలచివేసాయి. అతను చేస్తున్న పనిని మరచిపోయి కలవరం చెందాడు. అతడు ఆ దొంగతో గేరేజి గది అవతల వరకు నడిచి వెళ్లి ఒక సాధారణ మనిషిలాగా మాట్లాడెను. వీధి చివర అతని కారు వరకు అతనితో నడచి వెళ్లి, వెనుదిరిగి ఇంటికి వచ్చేసాడు. దేవుడు మళ్లీ చెప్పాడు, అపవాది వైపు చూడకుండా దేవుని ప్రేమ రాజ్యం వైపు నీవు చూడాలని నేను నీకు బోధించతలచాను. ఒక రోజు ఇదే వ్యక్తి ఇంటివద్ద నుండగా, ఒక యువకుడు వచ్చి పొరుగువాని ఇల్లు దొంగచే దోచుకొనబడుతుందని చెప్పాడు. పొరుగు వాని ఇంటి కిటికీ మీదుగా లోనికి ఎక్కి ఇంటనుండి సామాన్లు బయటకు ఈడ్చుకొస్తున్న దొంగను చూచాడు. ఏదో ఒకటి చేయాలి. అతడు పొరుగువాని ఇల్లు దోచుకొంటున్నాడు. అయితే దేవుడు చెప్పిన బోధను అతను మరచిపోయి, విసుగు చెంది అతడు ఆ దొంగను ఎదుర్కొన్నాడు. వెంటనే ఆ దొంగ తన జేబులోనుండి తుపాకి తీయడానికి సిధ్ధపడుతున్నట్లు గమనించాడు. దేవుడు అతని మనస్సును తొందరపెట్టి దేవుని ప్రేమరాజ్యంలో నడవడం లేదని చెప్పాడు. ప్రభువు యొక్క స్వరం అతడు వినిన వెంటనే అతని ఆలోచనను మార్పు చేసుకొని ఆ దొంగతో సోదరుడా,దేవుడు నిన్ను ఆశీర్వదించును గాక అని చెప్పి, నీవు యేమి చేస్తున్నావు అని అడిగాడు. ఆ దొంగ జేములోనుండి తన చేతిని వెనక్కి తీసుకున్నాడు మరియు కరచాలనం చేయడానికి తన చేతిని చాపాడు. అతడు యేమి జరుగుచున్నదో దాని గురించి ఆశ్చర్యపోయి ఉండవచ్చు. నీవు చెడువైపు తిరిగినప్పుడు నీవు అపవాదిని బలపరచినవాడవవుతావు అని దేవుడు బోధిస్తున్నాడు. అపవాదిని చెడుతో కాకుండా మంచితో జయించాలని దేవుడు బోధించాడు. అతడు అక్షరాలా అపవాదిని జయించాడు. యేలయనగా అతడు ప్రభువు యొక్క మంచితనముతోను, ప్రేమతోను నడిచాడు.

మనం మంచి చెడులను తెలియచేసే పండును తింటున్నాము కాని మనము జీవ వృక్షాన్ని తినాలని దేవుడు కోరుచున్నాడు. మన మనసులు దేవునితో ఐఖ్యము చెందినపుడు మనము దేవుడు ఆలోచించినట్లు ఆలోచించగలము. ఆయన వాక్యాన్ని అభ్యానములో పెట్టడానికి అనువైన పరిస్థితులను ఆయన మనకు తీసుకువస్తాడు. నేను దీనిని ఎలా చేస్తున్నానో మీతో పంచుకుంటాను. ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము. మనము దీనియందు ఉత్సహించి సంతోషించెదము (కీర్తన 118:24) అనే వైఖరితో ఉదయాన్నే లేవాలి. నీ మార్గంలో యేమి సంభవించినా పరవాలేదు, స్తుతి, కృతజ్ఞతలు తెలిపే వైఖరిని నీవు కలిగియున్నావు. నీ

ఆలోచనలు మారినప్పుడు నీ పరిస్థితులు మారతాయి. నీ శత్రువు నిన్నెప్పటికి బాధించలేడు. నీ శత్రువు యెడల నీవు చూపిన రియాక్షన్‌ను బట్టి నీవు బాధించబడతావు. **నీవు ఎలా రియాక్ట్ అవుతావో అదే నిన్ను బాధిస్తుంది**. యేసు శత్రువును స్నేహితుడా అని పిలిచాడు. నీకు ఎదురయ్యే ప్రతి పరిస్థితి కూడా నిన్ను దేవునిలో లోతుగా నడిపించడం కొరకే. ప్రేమ రాజ్యంలో నడుచుటకు ఆయన నీకు బోధించి తర్ఫీదు నిస్తున్నాడు. ప్రేమ చెడును యోచించదు దాని అర్థం ఇతరులను గురించి చెడుగా ఆలోచించకుండా ఉండుటయే. ఉదయాన్నే లేవగానే స్తుతించుట, కృతజ్ఞతలు తెలియచేయుట అనే వైఖరిని కలిగి దేవునితో సహవాసం కలిగియుండు. మంచిని గురించి, జీవమును గురించి ఆలోచించుట వలన, ఆ ఆలోచన నీ శరీరం మీద ప్రభావము చూపి నీ శరీరం ఆరోగ్యవంతంగా తయారవుతుంది. మరణమును గురించి ఆలోచించినపుడు అది నీ శరీర అవయవముల మీదకు ప్రవహించును. జీవమును గురించి ఆలోచించినపుడు అది నీ శరీర అవయవములకు ప్రవహించును. ప్రేమ చెడును గూర్చి ఆలోచించదు.

1 కొరింథి 13:4 **'' ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు, ప్రేమ డంబముగా ప్రవర్తించదు, అది ఉప్పొంగదు''**. చాలా కాలము నీవు బాధననుభవించిన కారణంగా చెడుగా తలంచినట్లయితే, అలా తలంచడం మాని, ఆయన ఎంతకాలం సహించాడో అది ఆలోచించు. మనము ఆయనతో కలవడానికి ఆయన చాలా కాలం మన కొరకు ఎదురుచూచాడు. **ప్రేమ దీర్ఘకాలము సహించును** దాని అర్థం నీవు నీ శత్రువును దీవించాలి. నీవు నీ శత్రువును దీవించినపుడు నీవు అతని గురించి చెడుగా మాట్లాడలేవు. నీ మాటలతో నీ శత్రువును నీవు దీవించాలి ఎందుకనగా నీ శత్రువు కూడా మంచిని కలిగియున్నాడు.

**ప్రేమ దయ చూపించును** దాని అర్థం నీ శత్రువు కొరకు కూడా దయ గలిగిన మాటలనే నీవు కలిగియుండాలి. నేను ఇప్పుడు ఉన్న స్థితిలో నేను సంతృప్తి చెందట్లేదు కావున ఈ స్థితి కంటె ఉన్నతమైన ఆత్మీయ రాజ్యములో జీవించాలనే కోరిక నాకుంది. ప్రేమ రాజ్యంలో మనము ఉండాలని దేవుడు కోరుచున్నాడని నాకు తెలుసు. ప్రేమ రాజ్యంలో నడచుట అనేది గొప్ప శక్తియై యున్నది అది ఈ సృష్టి అంతటికి విడుదల కలిగించును.

యేసు వలె మనము పరిచర్య చేయడానికి పిలువబడ్డాము. ఆయన ఈ లోకములోనికి పంపబడినట్లే మనము ఈ లోకములోనికి పంపబడ్డాము. పాపములు నిలిచియుండుటకు కాదు పాపములు క్షమించమని మనతో చెప్పాడు. యోహాను 20:21-23 **"అప్పుడు యేసు మరల మీకు సమాధానము కలుగును గాక, తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని వారితో చెప్పెను. ఆయన ఈ మాట చెప్పి వారిమీద ఊది పరిశుద్ధాత్మను పొందుడి. మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును, ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో అవి నిలిచి యుండునని వారితో చెప్పెను.** క్షమించుట అనగా క్షమించి వదిలి వేయుట, నేరము మోపకుండుట, బంధకముల నుండి విడిపించుట, పాప పరిహారము చేయుట. అందుచేత మనము వెళ్లి ప్రజలయొక్క పాపములు నిలిచి యుండనియ్యక క్షమించ వలసిన వారమై యున్నాము. ఎందుకనగా యేసు వారిని క్షమించాడు. యేసు ప్రజల పాపముల కొరకు పరిహారము చెల్లించాడు. దయగలిగిన పనులు చేయటకు దయను కలిగియుండ వలసిన వారమై యున్నాము. 1 కొరింథి 13 వ అధ్యాయానికి తిరిగి వెళదాం.

**ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును, ప్రేమ మత్సరపడదు.** నీ కంటె అధికముగా దేవుడెవరినైనా ఆశీర్వదించాడని నీవు అనుకుంటె, దేవుని ప్రేమ ఇంకా నీలో పరిపూర్ణత చెందనట్లే. **ప్రేమ మత్సరపడదు.** మత్సరము నీ శరీర అవయవాల మీద పనిచేసి మరణానికి తీసుకుని వెళుతుంది. ఇది జీవాన్ని తీసుకురాదు. నిజమైన ప్రేమ డంబముగా ప్రవర్తించదు. నిజమైన ప్రేమ ఉప్పొంగదు కాని దేవుని మహిమపరచును . **ప్రేమ అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు, త్వరగా కోపపడదు.** నీవు కోపము చెందిన యెడల శాంతమును కోల్పోవుదువు, అపుడు నీవు దేవునిలో ఉన్నవాడవు కావు. ఈ ప్రేమ నీలో పనిచేయునట్లుగా దేవునికి నీవు అవకాశమివ్వాలి. నీలో ఈ ప్రేమ పనిచేయడానికి దేవుడు కొంతమంది శత్రువులను నీ మార్గంలోకి తీసుకు వస్తాడు. నీవు ఇష్టపడని ప్రజలను లేదా నిన్ను విసిగించేటటువంటి వారిని నీ మార్గములోకి తీసుకువస్తాడు. ఈ

విధానములో ఆయన నీ కుటుంబాన్ని లేదా, నీ స్నేహితులను, నీ పిల్లలను, ప్రజలను వాడుకుంటాడు. **అపకారమును మనస్సులో ఉంచుకొనదు.** ఇతరుల దోషములను గురించి ఆలోచించడం మొదలు పెట్టినప్పుడు నీలో విసుగుదల లేదా మనస్థాపం మొదలవుతుంది. వారి కోసం ప్రార్థన చేయి కాని వారిని గురించిన ఆలోచన కొనసాగించవద్దు అని దేవుడు చెప్తున్నాడు. **సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును, అన్నిటిని నిరీక్షించును, అన్నిటిని ఓర్చును. ప్రేమ శాశ్వతకాలముండును.** చాలా కాలమునుండి నీవు ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నావు కాని ఇంకను యేమియు జరగలేదు. అపుడు " ప్రేమ క్రియ చేయలేదు, నేను దాని వైపు చూడను" అని నీవు చెప్తావు. దేవుని ప్రేమ రెండంచెలు కలది. ఒకటి కరెక్ట్ చేసేది. ఒక వ్యక్తిని కరెక్ట్ చేసే దేవుని సమయం ఉంది, అయితే అంతవరకు నీవు ఆ వ్యక్తిని ప్రేమించాలి నీ మాట అతడు వినులాగున. నీలో దేవుని ప్రేమను వారు చూడకపోయినట్లయితే వారు నీ మాట వినరు. ఒక వ్యక్తిని నీవు చాలా సంవత్సరాలు ప్రేమించి, అనేక విషయాలలో అతనిని సహించిట్లయితే, నీ బోధను లేదా నీ ఆదేశములను వారు ఆలకించే సమయము ఒకటి వస్తుంది. దేవుని సమయము రాకుండా ప్రజలు దేవుని వాక్యమును వినలేరు. దేవుని సమయం కొరకు మనము వేచి యున్నప్పుడు, సరైన మార్గంలో జీవించుటకు వారికి మనం బోధింప సమర్ధులం కాగలము.

యెషయా 2:3 **" ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము, యెరూషలేములో నుండి యెహోవా వాక్కు బయలు వెళ్లును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు".**

సమయము వచ్చునప్పుడు, దేవుడు చూచినట్లుగా నీవు చూచుట ప్రారంభించినప్పుడు సీయోను పర్వతమునకు వెళ్లుదము రండి అని నీవు ప్రజలతో చెప్పనవసరము ఉండదు. సీయోను పర్వతమునకు వెళ్లి ఆయన మార్గముల విషయమై నేర్చుకుందాం అని వారే చెప్పుదురు. వారు నీ యొద్దకు పరుగెత్తుకుని వత్తురు. అప్పుడు నీవు వారికి దేవుని మార్గములను బోధింప మొదలు పెట్టుదువు.

1 కొరింథి 13: 8-10 **"ప్రేమ శాశ్వతకాలముండును. ప్రవచనములైనను నిరర్థకములగును, భాషలైనను నిలిచిపోవును, జ్ఞానమైనను నిరర్థకమగును. మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని, పూర్ణమైనది వచ్చునప్పుడు పూర్ణము కానిది నిరర్థకమగును".**

మనము దేవుని ప్రేమ యొక్క పరిపూర్ణతలోనికి ఇంకనూ ప్రవేశించలేదు. ఒక పద్ధతి ద్వారా దేవుడు నీలో క్రియ చేస్తాడు. ప్రతి ఒక్కరి హృదయంలో ఉన్న దేవుని ప్రేమ ఇతర దేశాలకు విస్తరించబడాలి. ప్రేమకు లోబడుట వలన అది విడుదల కావింపబడును. నీ ఫీలింగ్స్ వల్ల కాదు. నిన్ను ఎవరైనా యేమైనా అనినప్పుడు నీలో ఉన్న దేవుని ప్రేమను మూసివేసిన సమయాలు లేవా? ఆ సమయంలో నీవు ఆ వ్యక్తి వైపు దేవుని ప్రేమను ప్రవహింప నియ్యలేదు. క్రీస్తును బహిర్గితం చేసి దేవుని ప్రేమను ఆ వ్యక్తి వైపు ప్రవహించేలా చెయ్యి. మార్పు రాకపోయినప్పటికి కూడా దృశ్యమైన వాటిని చూడక అదృశ్య సంగతులను చూడు. దాని అర్థం దేవుని వాక్యం వైపు అనగా చివరి ఫలితాన్ని చూడాలి. నీ మొత్తము ఆలోచన మరియు జీవిత విధానములో మార్పు తేవాలని దేవుడు కోరుకుంటున్నాడు.

నేను విమానంలో ఫ్లోరిడాకు వెళుతున్నప్పుడు ఒక పత్రికలో క్యాథలిక్ నన్ అయినటువంటి మదర్ థెరిస్సా గురించి చదివిన విషయం గుర్తుంది. ఈ ప్రపంచంలోని ప్రతి వ్యక్తి కూడా యేసుక్రీస్తులో భాగముగా ఆమె చూచినట్లు నేను చదివాను. పేద దేశాలలో ఉన్న ప్రతి వీధికి వెళ్లి మందులు పంచుతూ వారికి చాలా శ్రద్ధ కలిగి సేవ చేసేటటువంటి పరిచర్యను ఆమె కలిగి ఉంది. ఆమెతో ఉన్న సహ పరిచారికులు (నన్స్) ఎవరితోనైన కఠినంగా వ్యవహరించినట్లయితే, వారిని ప్రక్కకు తీసుకొని వెళ్లి వారితో "ఆ వ్యక్తికి మనమేదైనా చేస్తే, అది క్రీస్తుకు చేస్తున్నామనే విషయం నీవు అర్థం చేసుకోలేదా?" అని చెప్పేది.

ప్రజల గురించి నీవు ఆలోచించి మాట్లాడే విధానము క్రీస్తుకు చేస్తున్నట్లే. అందుచేత ఆమె అద్భుతమైన పరిచర్యను కలిగి ఉంది. ఆశ్చర్యకరంగా ఆ స్త్రీని

దేవుడు వాడుకున్నాడు. ఆమె జీవిత చరిత్రను మీరు చదవాల్సిందే. అందుచేత దేవుని సేవకులు ఇక్కడకు వచ్చినప్పుడు వారికి భోజనం ఏర్పాటు చేసి, అది క్రీస్తుకు చేసినట్లుగా భావించేవారం. కొన్ని సార్లు వారు రాజు వలె భోంచేసేవారు. ప్రతి ఒక్కరి యెడల ఆ విధంగా వ్యవహరించాలని దేవుడు కోరుచున్నాడు. ఈ రోజే దేవుని వాక్యాన్ని తీసుకో, దానిని ధ్యానించు, దాని గురించి ఆలోచించు. ఉదయాన్నే స్తుతి, కృతజ్ఞత అనే వైఖరితో నీ మనస్సులో ప్రేమను నిలుపుకో. ప్రజలు నీకు చెడు చేయడం మొదలు పెట్టినప్పుడు, వాటియందు లక్ష్య ముంచక, దేవుని స్తుతించు. **ప్రతి విషయము నందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట దేవుని చిత్తమై యున్నది.** నీవు మనస్థాపం చెంది, విసుగు చెందడం ప్రారంభించినప్పుడు, దేవుని స్తుతించి క్షమించినట్లయితే దేవుడు నీ మనస్సులో తిరిగి నెమ్మదినిస్తాడు. దీనిని సాధనలో పెట్టు. ఆమెన్